# సాక్షి

# పార్వతీపురం మన్యం

గురువారం । 29 । మే । 2025




**వైద్య శాఖలో బదిలీ ఫీవర్..!**

వైద్యవిధాన్ పరిషత్‌లో ఉద్యోగుల బదిలీలకు సన్నాహాలు చేస్తున్నారు. దీర్ఘకాలికంగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు కలవరపడుతున్నారు.
- 8లో



**సామాజిక అధ్యయనం సర్వే అడ్డగింత**
- 8లో

మారిక గిరిజన గ్రామ భూములను అదానీ కంపెనీకి అప్పగించవద్దంటూ గిరిజనులు ఆందోళనకు దిగారు. సర్వేను అడ్డుకున్నారు.



**104 డీఎంగా విలియమ్ చంద్**



విజయనగరం ఫోర్ట్: 104 జిల్లా మేనేజర్‌గా డి.విలియమ్ చంద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పశ్చిమగోదావరి జిల్లా 104 జిల్లా మేనేజర్‌గా పని చేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. 104 అంబులెన్సు ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తామన్నారు.

## న్యూస్‌రీల్

### డీఐఈఓగా నాగేశ్వరరావు



నాగేశ్వరరావును అభినందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల సిబ్బంది

పార్వతీపురం టౌన్: డీఐఈఓగా వై.నాగేశ్వరరావు బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆయన పనిచేస్తున్నారు. ఇదివరకు డీఐఈఓగా పనిచేస్తున్న మంజుల వీణ మక్కువ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కళాశాలల సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

### డోలీలో నదిని దాటించి..



నాగవళి నది ప్రవాహంలో డోలీలో రోగిని తరలిస్తున్న వనధార గ్రామస్తులు

కొమరాడ: మండలంలోని చోళ్లపదం పంచాయతీ పరిధిలోని వనధార గ్రామానికి చెందిన కొండగొర్రి శ్రీను గత రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. మంగళవారం అర్ధరాత్రి జర్వం ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు కారుచీకటిలోనే డోలీలో నాగవళి నది గుండా కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించిన తర్వాత జిల్లా కేంద్రాస్పత్రికి తీసుకెళ్లారు. నాగావళి అవల ఉన్న రెబ్బ, వనధార గ్రామాలకు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. గ్రామంలో అధిక మంది జ్వరాలతో బాధపడుతున్నారని, వైద్యశిబిరం ఏర్పాటుచేయాలని కోరారు.

### కదలని ఏనుగులు



తోటపల్లిలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి గ్రామ పరిసరాల్లో మూడు రోజులుగా ఏనుగులు సంచరిస్తూ పంటలు, తోటలను నాశనం చేస్తున్నాయంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. అరటి, పామాయిల్, మామిడి తోటలను ధ్వంసం చేస్తున్నాయని, ఏనుగులను మళ్లించే ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

### కొత్త బాధ్యతలు

- విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా దయానంద్



బచ్చల దయానంద్

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా కురుపాం మండల కేంద్రంలో నివసిస్తున్న గుమ్మలక్ష్మీపురం మండలం గొయిపాక గ్రామానికి చెందిన బచ్చల దయానంద నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

- ఇంటింటి సేవలకు మంగళం
- భర్తీకాని సచివాలయ ఖాళీ పోస్టులు
- రేషనలైజేషన్ పేరుతో సచివాలయాలు, ఉద్యోగుల కుదింపు ప్రయత్నాలు
- రైతన్నకు దూరమైన సాగుసేవలు
- మసకబారుతున్న గ్రామస్వరాజ్యం
- తిరోగమనం దిశగా కూటమి ప్రభుత్వ చర్యలు

# నాడు కళకళ.. నేడు వెలవెల..!

పాలకొండ రూరల్/గుమ్మలక్ష్మీపురం:

గత ఐదేళ్ల పాటు పాలించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఊరు/వార్డు అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగించింది. పేద, బడుగు వర్గాలకు సంక్షేమ పథకాలతో ఆర్థిక ఊతం కల్పించింది. పల్లెప్రజల పనులకు ఇబ్బంది కలగకుండా ఇంటివద్దకే సేవలందించింది. సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి లక్షలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పనతో పాటు వ్యయప్రయాసలకు గురికాకుండా ప్రభుత్వ సేవలను అందించింది. మరుగుదొడ్డికి నోచుకోని ఊరిబడిని సకల సదుపాయాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దింది. పేదకుటుంబాల పిల్లలు అంతర్జాతీయ అవకాశాలు అందుకునేలా ఆంగ్లం చదువులను అందుబాటులోకి తెచ్చింది. ఎప్పుడూ ప్రభుత్వ కార్యాలయాన్ని చూడని పల్లెల్లో.. రూ.కోటి ఖర్చుతో సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్‌క్లినిక్ వంటి భవనాలను నిర్మించింది. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల పురోగతికి అవిశ్రాంతంగా కృషిచేసింది. రైతన్న సాగుకు అండగా నిలిచింది. విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చేసింది. రాజకీయాలకు అతీతంగా, అర్హతే కొలమానంగా పథకాలు మంజూరు చేసింది.



**నాడు:** సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాకారం. ఆర్‌బీకేలతో రైతు చెంతనే సాగుసేవలు. పంటలను మద్దతు ధర కల్పన. కియోస్క్ యంత్రాలతో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్రాల సరఫరాకు ఇండెంట్. సకాలంలో పంపిణీ. ఊరిబడిలో ఆంగ్లం చదువులు. నాడు-నేడు అనేలా ముస్తాబైన బడులు. పల్లె ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ సేవలు. వలంటీర్లతో ఇంటింటికీ పింఛన్లు. పథకాల కోసం అర్హుల ఇంటికి వచ్చి దరఖాస్తుల స్వీకరణ. స్థానిక యువతకు ఉపాధి కల్పన. క్షణాల్లో రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులు పూర్తి. విద్యార్థులకు అవసరమైన ధ్రువపత్రాలు జారీ. ఏడాదిలో రెండు సార్లు కొత్త రేషన్ కార్డుల మంజూరు. రెవెన్యూ సమస్యలకు సకాలంలో పరిష్కారం. ఎలాంటి వ్యయప్రయాసలు లేకుండా ఊరు/వార్డు దాటకుండా అందిన 540 రకాల ప్రభుత్వ సేవలు. ఏ పనికావాలన్నా ఊరిలోని సచివాలయం ఉందన్న భరోసా. పాలనకు జవాబుదారీగా నిలిచే పాలకులు.



**నేడు:** వలంటీర్ వ్యవస్థకు మంగళం. ఇంటింటి రేషన్ పంపిణీ వ్యవస్థ రద్దు. అర్జీల స్వీకరణ, పరిష్కారంలో జాప్యం. పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి. ఏడాదిగా కొత్త రేషన్ కార్డుల మంజూరు లేదు. విత్తనాలు, పురుగు మందులు అందని దుస్థితి. సాగుసాయం శూన్యం. పంటను విక్రయించేందుకు రైతులకు తప్పని పాట్లు. గిట్టుబాటు ధర కల్పనలో విఫలం. విపత్తుల సమయంలో ఆదుకోని వైనం. ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం. ధ్రువపత్రాల దరఖాస్తుకు అధికమంది విద్యార్థులు మీ సేవా కేంద్రాలను ఆశ్రయిస్తున్న వైనం. సేవలకు దూరంగా సచివాలయం.. వాటిపై రేషనలైజేషన్ పిడుగు. సరిగ్గా ఏడాదిలోనే గ్రామ స్వరాజ్యానికి కూటమి తూట్లు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో వచ్చని, ప్రశాంతమైన పల్లెల్లో రాజకీయ చిచ్చు. అస్తవ్యస్థ పాలనపై పల్లె/పట్టణ ప్రజలు కన్నీరు పెడుతున్న వైనం.

### నేడు అంతా అస్తవ్యస్థం

ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే సంక్షేమ పథకాలను అటకెక్కించింది. సూపర్ సిక్స్ అంటూనే ప్రజలకు మోసం ఫిక్స్ చేస్తోంది. వలంటీర్లకు రూ.10వేలు ఇస్తామని చెప్పి ఏకంగా ఆ వ్యవస్థనే రద్దుచేసింది. తాజాగా ఎండీయూ వాహన సేవలను నిలిపివేసి నిరుద్యోగుల ఉపాధికి గంటికొట్టింది. ప్రజలకు కష్టాలను షురూ చేసింది. ఏడాదిగా సాగుసాయం కోసం ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే ఎదురవుతోంది. ప్రభుత్వ సేవలు అందని ద్రాక్షగా మారాయి. ఉద్యోగ వర్గాలను వివిధ సర్వేలకు పరిమితం చేస్తూ సంక్షేమాన్ని పక్కనపెట్టేస్తోంది. ఏ చిన్న సమస్యకైనా మండల కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు పరుగుతీయాల్సి వస్తోంది. పాలకులను ప్రసన్నం చేసుకుంటే తప్ప పనులు పూర్తికాని పరిస్థితి ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అభివృద్ధి, సంక్షేమం అలా ఉంచితే ఉన్న వసతులు ఒక్కొక్కటిగా కనుమరుగైపోతుండడం జిల్లా ప్రజలను ఆవేదనకు గురిచేస్తున్నాయి. చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు, ఉద్యోగాల తొలగింపు ఆందోళన కలిగిస్తున్నాయి.





బియ్యం బండి ఇక రాదండి...

### ఇదీ పరిస్థితి..

పార్వతీపురం మన్యం జిల్లాలో సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ సబ్‌ప్లాన్ పరిధిలోని బలిజిపేట, సీతానగరం, గరుగుబిల్లి మండలాలతో పాటు మిగిలిన 12 మండలాల్లో 451 గ్రామ పంచాయతీలు, 955 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటిలో 2,22,175 పైచిలుకు ఆవాసాలు ఉండగా వీటిలో 1,30,121 గిరిజన ఆవాసాలే. 9,44,886 మంది జనాభాకు తగ్గట్టు గ్రామీణ ప్రాంతాల్లో 312, పట్టణ ప్రాంతాల్లో 38 సచివాలాయాలు సేవలు అందిస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. వీటి ద్వారా మీసేవా, నాన్ మీసేవా, కామన్ సర్వీస్ సెంటర్స్, ఆధార్ కేంద్రాల నిర్వహణతో కూడిన 540 రకాల సేవలు ప్రజల చెంతకు చేర్చేవారు. ఇప్పుడు ఈ సేవలపై నిర్లక్ష్యపు మబ్బులు కమ్ముకున్నాయి.

### పనులు జరగడం లేదు



గతంలో వలే సచివాలయాల్లో అర్జీ చేసుకుంటే పనులు జరగడం లేదు. కేవలం అర్జీలు స్వీకరిస్తున్నారే తప్ప పరిష్కారం లేదు. కొత్త రేషన్ కార్డులు ఏడాదిగా మంజూరు కాలేదు. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు. ఇది సరికాదు.

– టి.మాధవరావు, మూలజమ్ముగూడ, జి.ఎల్.పురం మండలం

### రాజకీయ జోక్యంతో ఇబ్బందులు



సచివాలయ ఉద్యోగులపై రాజకీయ జోక్యం ఎక్కువైంది. ఒత్తిడి పెరుగుతోంది. అసలు లక్ష్యం పక్కదోవ పడుతోంది. సర్వేల పేరుతో పనిభారం పెంచడం వల్ల ప్రజలకు అసలైన సేవలు అందడం లేదు. అర్జీల స్వీకరణకే సచివాలయాలు పరిమితం కావడం సరికాదు. గతంలో మాదిరిగా సంక్షేమ పథకాలు మంజూరు చేసే కేంద్రాలుగా మారాలి. పేద పిల్లలు చదువుకునే ఊరిబడికి గత ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను పరిరక్షించాలి.

– దుప్పాడ పాపినాయుడు, పాలకొండ పట్టణం

### నీరుగారుతోంది

సమున్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ నేడు నీరుగారిపోతుంది. సిబ్బందిని యాప్‌ల పేరిట, రేషలైజేషన్ పేరిట ఒత్తిడికి గురి చేస్తున్నారు. ప్రభుత్వం సచివాలయ వ్యవస్థపై మరింత లోతైన అధ్యయనం చేసి వాటిని మరింత బలోపేతం చేయాలి.

– లిల్లీ పుష్పనాథం, విశ్రాంత నగర కమిషనర్, పాలకొండ

# సాగునీటి కోసం.. రోడ్డెక్కిన రైతన్న




ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల ర్యాలీ

- సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ.. అనంతరం ధర్నా

పాలకొండ: తోటపల్లి కాలువల ఆధునీకీకరణ, కాలువల్లో పూడిక తీత, శివారు ప్రాంతాలకు సాగునీరు అందించే విషయంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రైతులు రోడ్డెక్కారు. పలుమార్లు వినతులు అందించినా ప్రయోజనం లేకపోవడంతో ఆందోళన తీవ్రతరం చేశారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కోటదుర్గమ్మ ఆలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నాకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ తోటపల్లి ఆధునీకీకరణ పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. పాలకొండ, వీరఘట్టం, జియ్యమ్మవలస, బూర్జ మండలంలోని పలు గ్రామాలకు ఏటా సాగునీరు అందడం లేదని ఆరోపించారు. పెద్ద బుడ్డిడి వద్ద మరమ్మతులకు గురైన సైఫూన్‌ను తక్షణమే బాగుచేయాలని కోరారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాస్ మాట్లాడుతూ కాలువల్లో పూడికలు తొలగించి ఖరీఫ్‌కు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందజేశారు. గతంలో ఇచ్చిన వినతులపై తీసుకున్న చర్యలు వివరించాలని ఏఓను నిలదీశారు. ఈ సమయంలో అధికారులకు, రైతులకు మధ్య వాగ్వాదం జరిగింది. సీఐ ఎం చంద్రమౌళి, ఎస్సై ప్రయోగ మూర్తిలు అక్కడికి చేరుకుని అధికారులతో సంయుక్త సమావేశానికి ఏర్పాటుచేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు కండాపు ప్రసాదరావు, డి.రమణారావు, ఇ.సింహాద్రి, గంగుల శ్రీనివాసరావు, కారెపు చిట్టిబాబు, ఎల్.నారాయణరావు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## వరికి మరో రూ.69

- క్వింటాకు మద్దతు ధర పెంపునకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- పెదవి విరుస్తున్న రైతులు
- పెరిగిన ఖర్చులకు చాలదంటున్న రైతు సంఘం నాయకులు

సాక్షి, పార్వతీపురం మన్యం: ఖరీఫ్ సీజన్‌లో వరి సహా 14 పంటలకు మద్దతు ధర పెంపునకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి క్వింటా ధాన్యంపై రూ.69 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో కనీస మద్దతు ధర రూ.2,369కి చేరింది. ఖరీఫ్ పంటలకు మద్దతు ధర భారీగా పెంచినట్లు కేంద్రం చెబుతుంటే.. రైతు సంఘం నాయకులు, రైతులు పెదవి విరుస్తున్నారు.

గత సీజన్‌లో సాధారణ రకం ధాన్యం క్వింటాకు రూ.2,300, ఏ-గ్రేడ్ రకానికి రూ.2,320గా మద్దతు ధర చెల్లించారు. క్వింటాకు కనీసం ఎంఎస్‌పీ కింద రూ.3 వేలు చెల్లించాలని రైతులు కోరుతున్నారు. దీంతో పాటు.. మొక్కజొన్నకు రూ.175, వేరుశనగ రూ.480, పత్తికి రూ.589 చొప్పున కనీస మద్దతు ధరను పెంచేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అయితే, జిల్లాలో పత్తి కొనుగోలులోనూ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. గత ఏడాది పత్తి పంట క్వింటాకు రూ.7,120 నుంచి రూ.7,500 వరకు ఉంది. ఈ మద్దతు ధర పొందిన రైతులను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు.

## నిబంధనలు పాటించాలి

- జేసీ శోభిక

పార్వతీపురం రూరల్: సినిమా థియేటర్ల నిర్వహణలో నిబంధనలు పాటించాల్సిందేనని జేసీ ఎస్.ఎస్.శోభిక యాజమాన్యాన్ని ఆదేశించారు. నర్సిపురం టీబీఆర్ థియేటర్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఆర్‌పీ ధరల ప్రకారం తినుబండారాల విక్రయం చేస్తున్నది లేనిది ఆరా తీశారు. ఫుడ్ శాంపిల్స్‌ను సేకరించాలని ఆహార భద్రత అధికారి రామయ్యను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయలక్ష్మి, వీఆర్‌ఓ శంకర్ పట్నాయక్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

**సాలూరులో..**

సాలూరు రూరల్: పట్టణంలోని లక్ష్మి, శ్రీలక్ష్మి, రామాథియేటర్లను తహసీల్దార్ ఎన్.వి.రమణమూర్తి పరిశీలించారు. ఫస్ట్‌షో ప్రదర్శించకపోవడంతో మరోమారు పరిశీలనకు వస్తానని తెలిపారు.



సినిమాహాల్‌లోని క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న జేసీ శోభిక

**పాలకొండలో..**

పాలకొండ రూరల్: పాలకొండ పట్టణం, మండల పరిధిలోని నాలుగు సినిమా థియేటర్లను తహసీల్దార్ బాలమురళీ కృష్ణ బుధవారం పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. ఉన్నతాధికారుల సూచనలతో ఈ పరిశీలన చేపట్టామన్నారు.

### ఎంత పెద్దచేపో..!

మక్కువ మండలం శంబర గ్రామ సమీపంలోని వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ వద్ద బుధవారం మత్స్యకారుల వేటచేయగా పెద్ద బొచ్చుచేప వలకు చిక్కింది. మత్స్యకారులు చేపను విక్రయించేందుకు మండల కేంద్రం మక్కువ తీసుకువచ్చి, తూకం వేయగా 10కిలోల బరువు తూగింది. చేపను రూ.1700కు విక్రయించారు. ప్రతి ఏటా వర్షాకాలం ఆరంభంలో వీఆర్‌ఎస్ ప్రాజెక్ట్‌లో వేటచేయగా, మత్స్యకారుల వలకు పెద్ద,పెద్ద చేపలు చిక్కుతుంటాయి.

-మక్కువ



# భారీ వర్షాలు.. అప్రమత్తంగా ఉండాలి

పార్వతీపురంటౌన్: అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. జిల్లా, మండల అధికారులతో బుధవారం ఉదయం టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అత్యవసర వేళ ఆదుకునేందుకు కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్:08963 293046ను ఏర్పాటు చేశామన్నారు. పార్వతీపురం, పాలకొండ రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మండలాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. తహసీల్దార్లు, వీఆర్వోలు, సిబ్బంది ప్రధాన కేంద్రాల్లో ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని తెలిపారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్ సిబ్బంది చెరువులు, అనకట్టలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. ప్రసవ సమయం దగ్గర పడిన గర్భిణులను వసతి గృహానికి, ఆస్పత్రులకు తరలించాలన్నారు.

**అవగాహనే ప్రధానం**

పార్వతీపురంటౌన్: ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ అధికారులను బుధవారం ఆదేశించారు. జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్, ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకాలు అమలుచేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం, సీతంపే ఐటీడీఏ పీఓలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, కెఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి పాల్గొన్నారు.



టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

# మిమ్మల్నే.. ఓ ఆసనం వేసి పోదురూ!

- యోగా మాసోత్సవంలో జన సమీకరణకు ఆపసోపాలు
- వేలల్లో రిజిస్ట్రేషన్ చేయించాలంటూ ఒత్తిళ్లు
- బలవంతంగా పేర్ల నమోదు.. సచివాలయ సిబ్బందికి టార్గెట్లు

సాక్షి, పార్వతీపురం మన్యం:

అంతర్జాతీయ యోగా దినోత్సవం పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న హంగామా అధికారులకు తలబొప్పి కట్టిస్తోంది. జూన్ 21వ తేదీ నాటికి అందరికీ యోగాపై సంపూర్ణ అవగాహన ఉండాలంటూ.. నెల రోజుల కార్యక్రమాలకు పిలుపునిచ్చిన విషయం విదితమే. ఈ సందర్భంగా ప్రతి రోజూ గ్రామ, పట్టణ స్థాయిల్లో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రజలను భాగస్వామ్యం చేయాలని సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి చేస్తున్నారు. జిల్లాలోని పార్వతీపురం, సాలూరు పురపాలక సంఘాలు, పాలకొండ నగర పంచాయతీతోపాటు.. సచివాలయాల పరిధిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రహదారులపై యోగా చేయిస్తున్నారు. ర్యాలీలు చేపడుతున్నారు. మొత్తంగా జిల్లా అధికార యంత్రాంగం దాదాపు కొద్ది రోజులుగా ఇదే పనిలో ఉంటోంది. జూన్ 21వ తేదీ వరకు ఉంటుంది కూడా. మరి.. ఇవన్నీ చేయాలంటే మనుషులు ఉండాలి. అందుకోసం అందుబాటులో ఉన్న ఏ ఒక్కరినీ వదలడం లేదు. అంగన్‌వాడీలు, డ్వాక్రా మహిళలు, విద్యార్థులు, వైద్య సిబ్బంది.. ఇలా ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేస్తున్నారు. వీటిని పక్కాగా అమలు చేసేందుకు గ్రామ, మండల స్థాయి కమిటీలను నియమించారు. యోగాంధ్ర మినహా.. కొద్దిరోజులుగా మిగతా విషయాలను పక్కన పెట్టేసింది.



పార్వతీపురంలో రహదారిపై యోగాసనాల సాధన

**లెక్కల కోసం తిప్పలు..**

యోగా మాసంలో భాగంగా వివిధ స్థాయిల్లో పోటీలు నిర్వహించాలని పై నుంచి ఆదేశాలు వచ్చాయి. అంతేకాదు.. పెద్ద ఎత్తున ప్రజలను భాగస్వామ్యం చేయాలని చెబుతున్నారు. దీంతో లెక్కలు చూపించేందుకు జిల్లా అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ చేయాలని సచివాలయ సిబ్బందికి లక్ష్యాలు నిర్దేశిస్తున్నారు. ఇందుకోసం యోగా మంత్ యాప్‌ను సిద్ధం చేశారు. స్వచ్ఛందంగా ప్రజలెవరూ నమోదుకు ముందుకు రాకపోవడంతో సచివాలయ సిబ్బందే.. తమకు తెలిసిన వారి నంబర్లు సేకరించి, వారికి ఓటీపీలు ఇవ్వండంటూ బతిమలాడుతూ, రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఇలా ఎందుకు ఓటీపీలు అడుగుతున్నారో కూడా చాలామందికి తెలియకపోవడం గమనార్హం. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు.. వారి కుటుంబ సభ్యులతోనూ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. జిల్లాలో 15 మండలాలు ఉండగా... మండలానికి కనీసం 40 వేల మంది పేర్లనైనా రిజిస్ట్రేషన్ చేయాలని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 48 వేల మందే నమోదయ్యారు. దీంతో రాష్ట్రస్థాయిలో పరువు కోసం అధికారులు సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. యోగాంధ్రలో భాగంగా ప్రతిరోజూ కార్యక్రమాలు నిర్వహించేలా షెడ్యూల్‌ను రూపొందించారు. పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 30న తోటపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద, జూన్ 5న సీతంపేట ఎన్‌టీఆర్ అడ్వంచర్ పార్కు, 12వ తేదీన మక్కువ మండలం వెంగళరాయసాగర్ ఏనుగు కొండ దగ్గర భారీ స్థాయిలో యోగా చేపడుతున్నారు. గతంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ఏదో కార్యక్రమం చేపట్టేవారని.. ఇలా నెల రోజులు నిర్వహించి, పెద్ద ఎత్తున నిధులు, సమయం వృథా చేయడం ఎన్నడూ లేదని ఉద్యోగవర్గాల్లో చర్చ సాగుతోంది. అధికారులు సైతం మరో దారి లేక ఫొటోల కోసం 'మమ' అనిపించేస్తున్నారు.



గరుగుబిల్లిలో వైద్యసిబ్బందితో యోగాపై అవగాహన ర్యాలీ

## క్లుప్తంగా

### రామతీర్థం హుండీల ఆదాయం రూ.29.96 లక్షలు



రామతీర్థం హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న శ్రీవారి సేవా భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని దేవస్థానం అధికారులు బుధవారం లెక్కించారు. మొత్తం 89 రోజులకు గాను దేవాలయంలో ఉన్న హుండీల ద్వారా రూ.29,76,730 ఆదాయం సమకూరిందని ఈఓ వై శ్రీనివాసరావు తెలిపారు. హుండీల లెక్కింపును దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌లు రాజకుమారి, చీపురుపల్లి కనకమహాలక్ష్మి, దేవస్థానం ఈఓ శ్రీనివాస్ దగ్గరుండి పర్యవేక్షించారు. లెక్కింపులో అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జిల్లాకు చెందిన పలువురు శ్రీవారి సేవా భక్తులు హుండీల ఆదాయ లెక్కింపులో పాల్గొన్నారు.

### సారా కేసుల్లో నలుగురి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న సారాను చూపుతున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం)/జియ్యమ్మవలస రూరల్: కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో బుధవారం జియ్యమ్మవలస మండలం చినమేరంగి, చినదొడిజ గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా కలిగిఉన్న ముగ్గురు వ్యక్తులతో పాటు సారా వండేందుకు ముడిసరుకులు సరఫరా చేసిన మరో వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. దాడుల్లో భాగంగా చినదొడిజ గ్రామ పరిసరాల్లో 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. దాడుల్లో ఆయన వెంట ఎక్సైజ్ ఎస్సై జె.రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

### ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య



ఉరివేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ అప్పలస్వామి

సాలూరు రూరల్: పట్టణానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ రెడ్డి అప్పలస్వామి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..స్థానిక రామా కాలనీలో నివాసముంటున్న అప్పలస్వామి (58) అనారోగ్య కారణంతో మనస్తాపానికి గురై ఆర్‌టీసీ కాంప్లెక్స్ మేడపై ఉరివేసుకున్నాడు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ బి.అప్పలనాయుడు తెలిపారు.

### పురుగు మందు తాగి మహిళ..



సూర్యకాంతం (ఫైల్)

గుర్ల: మండలంలోని పాలవలసకు చెందిన కోడి సూర్యకాంతం (45) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే కొద్దిరోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది, ఆ బాధను భరించలేక మూడు రోజుల క్రితం పురుగు మందు తాగేసింది. అనంతరం అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. గుర్ల పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డెస్‌డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹120 | ₹210 | ₹220 |



# ఏకతాటిపై నడుద్దాం..

- పార్టీ పటిష్టతలో ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షుల పాత్ర కీలకం
- పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా సమన్వయంతో పని చేయాలి
- పార్టీ పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పిలుపు
- పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో దిశా నిర్దేశం
- హాజరైన పార్టీ పార్లమెంటరీ జిల్లా పరిశీలకుడు కిల్లి సత్యనారాయణ



వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, పాల్గొన్న విజయనగరం పార్లమెంటరీ జిల్లా పరిశీలకుడు కిల్లి సత్యనారాయణ

విజయనగరం:

కలిసికట్టుగా పని చేస్తూ జిల్లాలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేద్దామని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పార్టీని అభివృద్ధి పథంలో నడిపించడంలో కార్య కర్తలే కీలకమని, అటువంటి కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఉద్ఘాటించారు. పార్టీ సిద్ధాంతాల కు అనుగుణంగా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ధర్మపురిలో గల సిరిస హస్ర రైజింగ్ ప్యాలెస్‌లో వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా కార్యవర్గ సభ్యులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కార్యవర్గానికి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతం, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, బూత్ లెవెల్ కమిటీల నియామకం, పార్టీ బలోపేతంతో జిల్లా కార్యవర్గ సభ్యుల పాత్ర తదితర అంశాలను వివరించారు. ఇప్పటి కే జిల్లా స్థాయి కమిటీల నియామకం పూర్తయిందని, పార్టీ అనుబంధ కమిటీల అధ్యక్షులను ప్రక టించినట్టు తెలిపారు. అనుబంధ, మండల స్థాయి కమిటీలను త్వరితగతిన నియమించాలని జిల్లా కార్యవర్గానికి సూచించారు.

**బాధ్యతల నిర్వహణే ప్రధానం..**

పార్టీ అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించేందు కు జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధంగా ఉండాలని మజ్జి శ్రీనివాసరావు సూచించారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు ప్రతినెలా జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తామన్నారు. జిల్లా, నియోజక వర్గ స్థాయి సమావేశాల్లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. పార్టీ కమిటీల నియా మకాలను పూర్తి చేయాలన్నారు. త్వరలో జరగను న్న స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి పార్టీని పూర్తి స్థాయిలో బలోపేతం చేసేందుకు సైనికుల్లా పనిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలిచ్చి అమలుచేయకుండా పబ్బంగడుపుతోందని, దీనిపై ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వ తీరుపై ప్రజల్లో చైతన్యం నింపాలన్నారు.

**పర్యవేక్షణ ఇలా...**

- ప్రధాన కార్యదర్శులు వర్రి నర్సింహమూర్తి జిల్లా పార్టీ కార్యాలయానికి ఇన్‌చార్జిగా బాధ్యత లు నిర్వహించడంతో పాటు ఎస్సీ, ఉపాధ్యాయ, అంగన్‌వాడీ, మేధావుల, ఉద్యోగులు/పెన్షనర్లు, గ్రీవెన్స్ సెల్ అనుబంధ విభాగాలను పర్యవేక్షిస్తారన్నారు.
- ఇప్పిలి అనంత్ పార్టీ కార్యక్రమాలు, బీసీ, రైతు, వలంటీర్, ట్రేడ్‌యూనియన్, ప్రచార, బూ త్ కమిటీ, పంచాయతీరాజ్ అనుబంధ కమిటీలను పర్యవేక్షిస్తారని చెప్పారు.
- మరో ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారు నాయుడు పార్టీ కార్యక్రమాలు, యువజన, మహిళా, క్రిస్టియన్, విద్యార్థి, సోషల్ మీడియా, మైనార్టీ, మున్సిపల్ అనుబంధ కమిటీలను పర్యవేక్షణ చేస్తారన్నారు.
- అల్లాడ సత్యనారాయణ లీగల్‌సెల్, ఆర్‌టీఐ, ఐటీ, దివ్యాంగుల విభాగాలకు.....
- శంబంగి వేణుగోపాలనాయుడు ఎస్టీ, చేనేత, వాణిజ్య, సంస్కృతిక, డాక్టర్స్ అనుబంధ కమిటీలను పర్యవేక్షిస్తారన్నారు.

**జూన్ 4న వెన్నుపోటు దినం**

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నిరసన గళం వినిపిస్తూనే ఉంటుంది. ఈ క్ర మంలో.. ఎన్నికల ఫలితాలు వెలువడిన జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినంగా నిర్వహిస్తామ ని ప్రకటించారు. ఆ రోజున ప్రజలతో కలిసి నిరసనలతో పాటు కలెక్టర్లను కలిసి హామీల డిమాండ్ పత్రాలను సమర్పిస్తామన్నారు.

# ఆడిట్‌కు నిరీక్షణ

- అసహనం వ్యక్తం చేసిన గురువులు



సమయానికి ఆడిట్ బృందం రాకపోవడంతో ఎంఈఓ ఆఫీస్ ముందు ఎదురుచూస్తున్న హెచ్‌ఎంలు



జమాఖర్చులపై ఆడిట్ నిర్వహిస్తున్న ఆడిట్ సభ్యుడు

బొబ్బిలిరూరల్: పాఠశాల నిర్వహణ కోసం ప్రభుత్వం అందిస్తున్న నిధుల వినియోగంపై నిర్వహిస్తున్న ఆడిట్ గందరగోళంగా మారింది.సరైన సదుపాయాలను కల్పించకుండా బుధవారం జరిగిన ఆడిట్‌కు ఏకంగా ఆరు మండలాల నుంచి ఎలిమెంటరీ, యూపీ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులను రప్పించారు. వారంతా పదిగంటలకే హాజరై కార్యాలయాల వద్ద పడిగాపులు కాసినా ఆడిట్ బృందం రావడం ఆలస్యం కావడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పాఠశాలల్లో నిర్వహణ ఖర్చులకింద ఇస్తున్న నిధుల వినియోగంపై ప్రైవేట్ ఏజెన్సీ లకు ఆడిట్ అధికారం అప్పగించడంతో వారు తమకు అనుకూల సమయాన్ని ఎంచుకుని ఆడిట్ నిర్వహిస్తున్నారని పలువురు గురువులు గుర్రుమన్నారు. సమయపాలన లేకుండా క్రమశిక్షణ నేర్పిస్తున్న గురువులకే పరీక్షలు పెడుతున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు.శిథిలావస్థలో ఉన్న చిన్నచిన్న గదులున్న ఎంఈఓ కార్యాలయం, భవిత కేంద్రంలో చీకట్లో ఆడిట్ నిర్వహించాల్సిన పరిస్థితి వచ్చింది.

**ఆడిట్ ఇలా..**

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యవసర పనుల నిర్వహణకు హైస్కూల్‌కు రూ.90వేలు, యూపీకి రూ.12వేలు, ఎలిమెంటరీ పాఠశాలలకు రూ.9 వేలు చొప్పున ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుంది. ఇందులో భాగంగా గతేడాది ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వరకు ఆయా పాఠశాలల్లో జరిగిన జమాఖర్చులపై బుధవారం ప్రైవేట్ ఏజెన్సీ సంస్థతో ఆడిట్ నిర్వహణ జరిగింది. బ్యాంకు పాస్‌పుస్తకాలు, ఓచర్లు, బిల్లులను పరిశీలించారు. ఈ ఆడిట్‌లో ఆరు మండలాలకు చెందిన ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆడిట్ బృందం పాల్గొన్నారు.

# గంజాయి కేసుల్లో త్వరితగతిన అరెస్టులు

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి సమావేశంలో పాల్గొన్న ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్షించి గంజాయి కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను త్వరితగతిన అరెస్టు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో గంజాయి అక్రమ రవాణా, వినియోగాన్ని నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, నిందితుల అరెస్టు, నేరాలు పునరావృతం చేసే వారి ఆస్తుల జప్తు, పెండింగ్ నాన్ బెయలబుల్ వారెంట్స్, డీ-అడిక్షన్ కార్యక్రమాలపై రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సమగ్రంగా చర్చించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాలకొండ డీఎస్పీ రాంబాబు, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# జీడి పిక్కల వ్యాపారి షాప్/ఇంటికి తాళాలు



ఎల్విన్‌పేటలో జీడి పిక్కల వ్యాపారి షాప్‌నకు తాళం వేస్తున్న గిరిజన, దళిత నాయకులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట గ్రామానికి చెందిన జీడి పిక్కల వ్యాపారి షాప్, ఇంటికి బుధవారం గిరిజన, దళిత నాయకులు నిమ్మక సింహాచలం, అడ్డాకుల చిన్నారావు, ఎస్.రామారావు తదితరులు తాళాలు వేశారు. ఈమేరకు ఎల్విన్‌పేట జంక్షన్ వద్ద రవి ఏజెన్సీస్ పేరుతో కొన్నేళ్ల నుంచి వ్యాపారం చేస్తున్న జి.రవికుమార్ జీడిపిక్కలు, ధాన్యం విక్రయించిన వందల మంది రైతులకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు స్థానికంగా పలువురి నుంచి రూ.లక్షల్లో అప్పులు చేసి ఏవరికీ ఏమీ చెల్లించకుండా, ఏ సమాచారం ఇవ్వకుండా పరారయ్యాడు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోందని.. ఐపీ పెట్టి ఎక్కడికో వెళ్లిపోయాడని తమకు రావాల్సిన డబ్బుల సంగతి ఏమిటంటూ పలువురు బాధితులు ఆ వ్యాపారి షాప్ ముందు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. పలువురి నుంచి రూ.2 కోట్లకుపైగా అప్పులు చేశాడని, తన ఇల్లు ,షాప్‌ను కూడా ఎవరికో రాసిపెట్టి వెళ్లిపోయాడన్న సమాచారం ఉందని, కావునే బాధితులందరికీ న్యాయం జరగాలన్న ఉద్దేశంతో వ్యాపారి ఇల్లు , షాప్‌కు తాళం వేసినట్లు నాయకులు తెలియజేశారు. ఈ సంఘటనపై ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని వారంతా పేర్కొన్నారు.

# 'గురుదేవా'లో చోరీ..!

- పెద్దమొత్తంలో బంగారం, నగదు పోయినట్లు సమాచారం
- ఘటనా స్థలంలో ఏఎస్పీ సౌమ్యలత విచారణ

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఇంట్లో మంగళవారం రాత్రి దొంగలు చొరబడి పెద్ద మొత్తంలో బంగారం , నగదు దోచుకుపోయినట్లు తెలిసింది. ట్రస్టు ఆవరణలోనే జగదీష్‌బాబు నివాస సముదాయం ఉంది. నగదు, బంగారం దేవుడి గదిలో ఎప్పటి నుంచో ఉంచుతున్నట్లు భోగట్టా. ఈ మేరకు మంగళవారం అర్ధరాత్రి సుమారు 2 గంటల ప్రాంతంలో దొంగలు చొరబడినట్లు తెలుస్తోంది. ఉదయం ఇంటిసభ్యులు లేచి చూసేసరికి దేవుడి గది చిందరవందంగా ఉండడంతో పరిశీలించగా బంగారం, డబ్బు కనిపించకపోవడాన్ని గుర్తించారు. ఈ మేరకు ట్రస్టు నిర్వాహకుల సమాచారంతో సీఐ సీహెచ్.షణ్ముఖరావు సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలన చేశారు. విజయనగరం నుంచి ప్రత్యేక క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలను సేకరించింది. అనంతరం ఏఎస్పీ సౌమ్యలత ఘటనా స్థలానికి చేరుకుని సంబంధిత పూజా గది, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వివరాలు వెల్లడించేందుకు ఆమె నిరాకరించారు. ఈ విషయమై సీఐ షణ్ముఖరావును వివరణ కోరగా.. ఎంతమొత్తంలో చోరీ జరిగిందో ఇంకా చెప్పలేమని, ఫిర్యాదు కూడా అందలేదని చెప్పారు.

# సామాజిక అధ్యయనం సర్వే అడ్డగింత



అడ్డుకున్న గిరిజనులకు నచ్చజెబుతున్న అధికారులు

- అధికారులను తిప్పి పంపిన గిరిజనులు

వేపాడ: మారిక గిరిజన గ్రామాన్ని, భూములను అదానీ కంపెనీకి అప్పగించవద్దంటూ 35 రోజులుగా సచివాలయం నుంచి కలెక్టర్ వరకు విన్నపాలు చేసుకున్నప్పటికీ సామాజిక అధ్యయనం సర్వే అధికారులను ప్రభుత్వం పంపడంపై గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వేపాడ మండలంలోని కరకవలస గిరిశిఖర మారిక గ్రామాన్ని, భూములను సామాజిక అధ్యయనం చేసేందుకు వల్లంపూడి ఎస్సై సుదర్శన్ నేతృత్వంలో పోలీస్ బందోబస్తుతో.. మండలస్థాయి అధికారులు తహసీల్దార్ రాములమ్మ, ఎంపీడీఓ సూర్యనారాయణతో కలిసి వెళ్లిన అధికారులను మారిక పొలిమేరలోనే గిరిజనులు అడ్డుకుని వెనక్కి పంపారు. మా పొలాలను గ్రామాన్ని అదానీ కంపెనీకి ఇచ్చే ప్రసక్తి లేదంటు తెగేసి చెప్పారు. మండలస్థాయి అధికారులు ఎంత నచ్చచెప్పినప్పటికీ గిరిజనులు పట్టు వీడకపోవటంతో అధికారులు వెనుదిరగాల్సి వచ్చింది. కార్యక్రమంలో మారిక గ్రామనాయకులు జలారి వీర్రాజు, బాబూరావు, అప్పలనాయుడు, సోమేష్, శ్రీను ఆసు, శోభన్‌బాబు, తదితర గిరిజనులు యువత, మహిళలు పాల్గొన్నారు,

**హెడ్రా పవర్ ప్రాజెక్టు భూసేకరణపై ప్రకటన**

మండలంలో కరకవలస పంచాయతీ గిరిశిఖర మారిక కొండపై రైవాడ ఓపెన్ లూప్ పంప్డ్ స్టోరేజ్ హెడ్రా పవర్ ప్రాజెక్టు భూసేకరణపై ఎస్ఐఏ అధికారుల పర్యవేక్షణకు బుధవారం శ్రీకారం చుట్టామని సామాజిక ప్రభావ అంచనా నివేదిక సామాజిక నిపుణుడు పి.దేవరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం సుమారు 8 కి.మీ కాలినడకన మారిక వెళ్లి ఫీల్డ్ వెరిఫికేషన్ చేసినట్లు తెలిపారు. భూసేకరణ చట్టం 2013పై గిరిజనులకు వివరించి సామాజిక ఆర్థిక, సాంఘిక సర్వేకు సహకరించాలని కోరామన్నారు. అయితే ఈ ఇన్‌స్పెక్షన్‌లో నిర్వాసితులు, పెద్దలు, ఎస్ఐఏ బృందం సభ్యులు, మండల రెవెన్యూ అధికారులు, ఎంపీడీఓను అడ్డగించారని తెలిపారు. గిరిజనుల అభిప్రాయాలను తమనివేదికలో కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

# వైద్య శాఖలో బదిలీ ఫీవర్..!

- ఏళ్లతరబడి ఒకేచోట పనిచేసిన వారిలో గుబులు
- ఏదో కారణం చెప్పి తప్పించుకుంటున్న పరిస్థితి




డీసీహెచ్‌ఎస్ కార్యాలయం

విజయనగరం ఫోర్ట్: వైద్యవిధాన్ పరిషత్ కార్యాలయంలో ఓ ఉద్యోగి 10 ఏళ్లకు పైగా ఒకేచోట పనిచేస్తున్నట్లు సమాచారం. ఒకే చోట పనిచేయడం వల్ల అధికారులను సైతం శాసించే విధంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారిగా ఎవరు వచ్చినా సదరు ఉద్యోగి మాటే చెల్లుబాటవుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే శాఖలో మరో ఉద్యోగి కూడా ఐదేళ్లకు పైగా ఒకే చోట పనిచేస్తున్నాడు.

ఇలా వీరిద్దరే కాదు. మరి కొంతమంది ఉద్యోగులు కూడా ఒకే చోట ఏళ్ల తరబడి పనిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఏ శాఖలో అయినా 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారి వివరాలు జాబితాను వెల్లడిస్తారు. కానీ వైద్యవిధాన్ పరిషత్ అధికారులు మాత్రం ఆ శాఖలో 5 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారి వివరాలు ఇవ్వడానికి అంగీకరించడం లేదు. లోపాలు బయట పడతాయనో, మరో కారణం చేతనో వివరాలు వెల్లడించడం లేదు. ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న వారి వివరాలు బయట పడతాయనే ఉద్దేశంతోనే అధికారులు వివరాలు వెల్లడించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**వైద్యవిధాన్ పరిషత్ పరిధిలో ఆస్పత్రుల వివరాలు**

వైద్యవిధాన్ పరిషత్ పరిధిలో ఎస్.కోట, గజపతినగరం, చీపురుపల్లి, రాజాం ఏరియా ఆస్పత్రులు, బాడంగి, భోగాపురం, బొబ్బిలి, నెల్లిమర్లలో సీహెచ్‌సీలు ఉన్నాయి. వాటి పరిధిలో వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్లు, జూనియర్ అసిస్టెంట్స్, సీనియర్ అసిస్టెంట్స్ సూపరింటెండెంట్స్, ఎంఎన్‌ఓ, అటెండర్స్, ఏఓ తదితర కేడర్లలో ఉద్యోగులు పనిచేస్తున్నారు.

**దీర్ఘకాలం ఒకేచోట పని చేస్తే అవినీతికి ఆస్కారం**

ఉద్యోగులు ఒకే చోట ఏళ్ల తరబడి పనిచేయడం వల్ల అవినీతి, అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఉద్యోగ నియామకాల్లో నూ ఇటువంటి వారు తమ వారికి ఉద్యోగాలను కట్టబెట్టుకునే అవకాశం ఉందనే విమర్శలు ఉన్నాయి.

**వైద్యారోగ్యశాఖలోనూ ఇదే పరిస్థితి:**

వైద్యారోగ్యశాఖలో కూడా ఇటువంటి పరిస్థితే నెలకొంది. ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేసిన వారికి బదిలీ తప్పనిసరి కావడంతో ఇక్కడ కూడా ఉద్యోగుల్లో గుబులు మొదలైంది. వివిధ కేడర్లలో ఉద్యోగులు ఇక్కడ కూడా ఒకే చోట పనిచేస్తున్నట్లు తెలుస్తోంది.

**పారదర్శకంగా బదిలీలు**

ఐదేళ్లకు పైబడి ఒకే చోట పనిచేసిన వారి వివరాలు వెల్లడించడానికి ఉన్నతాధికారుల పర్మిషన్ అడిగాం. పర్మిషన్ రాకపోవడంతో వివరాలు వెల్లడించలేదు. బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తాం

డాక్టర్ ఎస్.పి. పద్మశ్రీరాణి, డీసీహెచ్‌ఎస్

# స్కూటర్ ఢీ కొని వ్యక్తి మృతి


- వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో మరో ముగ్గురి మృతి



దుర్మరణం చెందిన అప్పలనాయుడు

విజయనగరం క్రైమ్: నగరానికి సమీప గ్రామం చెల్లూరు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. చెల్లూరు గ్రామానికి చెందిన అప్పలనాయుడు విశాఖ-విజయనగరం హైవేపై రాంగ్ రూట్‌లో సాయంత్రం 4 గంటలకు రోడ్డు దాటుతుండగా ఎదురుగా స్కూటర్ రావడంతో ఢీ కొనగా అక్కడిక్కడే కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే క్షతగాత్రుడిని హాస్పిటల్‌కు తరలించే లోగానే తుదిశ్వాస విడిచాడు. మృతుడి కుమార్తె రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ఆర్టీసీ బస్సు ఢీకొని మరొకరు..**



ఘటనా స్థలంలో శ్రీనివాస రావు మృతదేహం

బొబ్బిలి: ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పట్టణంలోని బలిజిపేట రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటనపై సీఐ కె.సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ..పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం జగ్గునాయుడి పేటకు చెందిన శ్రీనివాసరావు తాపీ, సెంటరింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. విధి నిర్వహణలో భాగంగా శనివారం పట్టణంలోని టీచర్స్‌కాలనీకి బైక్‌పై వెళ్తుండగా బలిజిపేట రోడ్డులోని ఇండియన్ బ్యాంకు వద్దకు చేరుకునేసరికి వెనుక నుంచి వస్తున్న శ్రీకాకుళం వెళ్తున్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొనడంతో బస్సు వెనక చక్రాల కింద పడి శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య ఇందిర, పాలిటెక్నిక్ చదివిన పవన్, హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్న చంటి అనే ఇద్దరు కుమారులున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి ప్రమాద వాహనాలను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చెప్పారు. ట్రాఫిక్ ఎస్సై వి.జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**చికిత్స పొందుతూ ఇంకొకరు..**



కేజీహెచ్‌లో మృతి చెందిన మధు

గంట్యాడ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే..ఈనెల 25వతేదీ రాత్రి గంట్యాడ మండలంలోని రామవరం జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని బైక్ పై వస్తూ ఢీకొట్టిన సారిక గ్రామానికి చెందిన కింతాడ మధు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కుటుంబసభ్యులు కేజీహెచ్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

**కుక్క కరిచి వైఎస్సార్‌సీపీ కార్యకర్త..**



సత్తారు సన్యాసిరావు

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువలో కుక్క కరిచి వైఎస్సార్ సీపీ కార్యకర్త బుధవారం మృతిచెందాడు. దీనిపై మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త,గత ప్రభుత్వంలో గ్రామ వలంటీర్‌గా పనిచేసిన సత్తారు సన్యాసిరావు (34)ఈ నెల 3వ తేదీన కుక్కకాటుకు గురయ్యాడు. దీంతో వెంటనే గ్రామ పరిధిలో ఉన్న ఆరికతోట పీహెచ్‌సీకి వెళ్లి రేబిస్ టీకా వేసుకున్నాడు. మూడు డోసులు వేసుకోవాల్సి ఉండగా ఇప్పటివరకు రెండు డోసులు వేసుకున్నాడు.వచ్చే నెల ఒకటో తేదీన మూడో డోసు వేసుకోవాల్సి ఉంది. అయితే ఇంతలో ఈ నెల 27వ తేదీన తలనొప్పి, కుక్క కరిచిన వైపు తిమ్మిర్లు వచ్చాయి. ఆఖరి డోసు రేబిస్ వేసుకుంటే తగ్గిపోతుందన్న ఉద్దేశంతో మిన్నకుండిపోగా బుధవారం ఉదయం అకస్మాత్తుగా మృతి చెందాడు.